సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 6 । జనవరి । 2023



ఆంగ్లంలో అదరగొట్టారు...

తాళ్లపాలెం గురుకుల విద్యార్థుల ప్రతిభకు మంత్రి నాగార్జున ఫిదా అయ్యారు. వారి ఆంగ్ల పరిజ్ఞానాన్ని మెచ్చుకున్నారు. 8లో



మీ ఫ్యామిలీ డాక్టర్

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు సర్వత్రా ప్రశంసలందుతున్నాయి. జిల్లాలో రోజుకు 600 మందికి సేవలందిస్తున్నారు. అచేతన రోగులకు ఇది వరంగా మారింది. 8లో

నేడు స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశంలో 23 అంశాలు చర్చిస్తారు.



తులసీరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఆనంద్‌కుమార్, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు కన్నబాబు, అదీప్‌రాజు



భారీ సంఖ్యలో అభిమానులు వెంటరాగా తులసీరావు అంతిమయాత్ర

కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర
- పోటెత్తిన అభిమానులు, రైతులు, నాయకులు
- స్వచ్ఛంద బంద్ పాటించిన వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు

తమకు వెన్నుదన్నుగా నిలిచిన మహావృక్షం కూలిపోయిందని పాడి రైతులు కుమిలిపోయారు.. ప్రగతి బాటలు పరిచిన మహనీయుడి నిష్క్రమణతో పల్లెలు తల్లడిల్లాయి.. ఆ పెద్దాయన వల్ల అనేక విధాలుగా లబ్ధి పొందిన వేలాదిమంది కన్నీరు మున్నీరయ్యారు.. పూలమాలలతో నివాళులర్పించారు.. తమ పెరటిలో 'తులసి' మొక్కవై తిరిగి మొలకెత్తాలని అశ్రునయనాలతో కడసారి ప్రార్థించారు.

అనకాపల్లి రూరల్/యలమంచిలి/మునగపాక: అసమాన 'పాల'నా దక్షతతో విశాఖ డెయిరీని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లిన ఆడారి తులసీరావు ఇక లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేక అభిమానులు ఆవేదన చెందారు. మనసులోని ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచిన తులసీరావు పార్థివ దేహం గురువారం ఉదయం విశాఖ చేరుకుంది. తొలుత గాజువాకలోని డెయిరీ ప్రధాన కార్యాలయంలో భౌతిక కాయాన్ని కాసేపు ఉంచి, ఉద్యోగులు, స్థానికులు నివాళులర్పించిన తర్వాత యలమంచిలి తరలించారు. నేరుగా పాత సినిమాహాలు మైదానం వద్ద పార్థివ దేహాన్ని ఉంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించిన అనంతరం తులసీనగర్‌లో వున్న ఆడారి నివాసానికి పార్థివ దేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు, రైతులు, పలు పార్టీలకు చెందిన నాయకులు వెంట రాగా అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర సాగింది. పురవీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భజనలు, తప్పెటగుళ్లు, అనేక వాద్యాల నడుమ ఆయన అభిమానులు జోహార్ తులసీరావు అంటూ నినదించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తులసీరావు సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరిగాయి. పార్టీలకతీతంగా టీడీపీ, జనసేన, రైతు, ప్రజా సంఘాల నాయకులంతా తరలివచ్చారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు తులసీరావు పాడె మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు.



తులసీరావుకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ కల్యాణి, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

లౌడ్‌స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు

సీఎం సహా అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆడారి తులసీరావు భౌతికకాయాన్ని సందర్శించేందుకు రావడంతో సామాన్యులు కూడా తిలకించేలా తులసీరావు కుటుంబసభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పట్టణంలో పలుచోట్ల లౌడ్ స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ చేశారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలను సంతాప సూచకంగా స్వచ్ఛందంగా మూసివేశారు.



తులసీరావు సతీమణి జయమ్మను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

నివాళులర్పించిన ఇతర ప్రముఖులు

తులసీరావు పార్థివ దేహాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, రమణమూర్తి రాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, బండారు సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథం, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యేలు చెంగల వెంకట్రావు, పీలా గోవింద సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చినప్పలనాయుడు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

నాన్న ఆశయం నెరవేర్చాలి..

- కుటుంబ సభ్యులకు సీఎం వైఎస్ జగన్ ఓదార్పు
- డెయిరీ దిగ్గజం తులసీరావుకు ఘన నివాళి



ఆడారి ఆనంద్‌కుమార్, పిళ్లా రమాకుమారిలకు ధైర్యం చెబుతున్న సీఎం

సాక్షి, అనకాపల్లి/గోపాలపట్నం: అధైర్యపడొద్దు ఆనంద్ అన్నా.. రమాకుమారి తల్లీ అంటూ ఓదార్చారు. నేనున్నానంటూ తులసీరావు సతీమణి జయమ్మకు చేతిలో చెయ్యి వేసి ధైర్యం చెప్పారు. 'వేలాదిమంది పాడి రైతుల యోగక్షేమాలు నాన్న నీకు అప్పగించారు.. ఆయన ఆశయం నెరవేర్చాల'ని ఆనంద్‌కుమార్‌కు హితబోధ చేశారు. అనారోగ్యంతో కన్నుమూసిన డెయిరీ దిగ్గజం, ఆంధ్రా కురియన్ ఆడారి తులసీరావు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం హెలికాప్టర్లో యలమంచిలి చేరుకున్నారు. పాత సినిమాహాలు మైదానంలో ఉంచిన తులసీరావు పార్థివ దేహం పై పుష్పగుచ్ఛం ఉంచి, ముకుళిత హస్తాలతో నమస్కరించారు. 20 నిమిషాలసేపు అక్కడ గడిపిన సీఎం తులసీరావు కుమారుడు, వైఎస్సార్‌సీపీ విశాఖ వెస్ట్ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. తులసీరావు సేవలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువా రం ఉదయం 11.44 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి వచ్చారు. మధ్యాహ్నం 12.02 గంటలకు ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి బయలుదేరి వెళ్లారు. తిరిగి యలమంచిలి నుంచి 12.52 గంటలకు హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుని 1.08 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆయన వెంట మంత్రి బొత్స సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

డెయిరీ ప్రాంగణంలో విషాద వదనాలు



డెయిరీ ప్రాంగణంలో కడసారి చూపు కోసం వేచి ఉన్న సిబ్బంది, అభిమానులు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రా కురియన్ ఆడారి తులసీరావును కడసారి చూసేందుకు విశాఖ డెయిరీ డైరెక్టర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, రాజకీయ ప్రముఖులు, ఆయన బంధువులతో విశాఖ డెయిరీ ప్రాంగణం జనసంద్రమైంది. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో ఆయన పార్థివదేహాన్ని తీసుకొచ్చి డెయిరీ ప్రాంగణంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. బోరున విలపిస్తూ.. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తులసీరావు కుమారుడు విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, కుమార్తె రమాకుమారి, కిమ్స్ ఐకాన్ ఎండీ పి.సతీష్‌కుమార్ విషణ్ణ వదనంలో కనిపించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, చైర్మన్లు, డైరెక్టర్లు ఆయనకు నివాళులర్పించారు. అనంతరం తులసీరావు భౌతిక కాయాన్ని యలమంచిలి తరలించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల 'జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహసారథి' (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 35 అసెంబ్లీ కోఆర్డినేటర్లు, 9,567 సచివాలయ కన్వీనర్లు, 1,07,916 గృహ సారథులు ఉంటారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో కాయకల్ప బృందం

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య బృందం(కాయకల్ప) గురువారం సందర్శించింది. బృందంలోని వైద్యులు నీలావతి, మహారాజ్‌లు ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే, క్షయవ్యాధి విభాగం, గైనిక్, జనరల్ ఓపీ, ల్యాబ్, చిన్నారుల వార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పరిశీలించిన వివరాలతో నివేదికను రూపొందించి, మూడురోజుల్లో అమరావతి వైద్యవిధాన శాఖకు అందించనున్నట్టు తెలిపారు. వైద్యాలయం ఆర్‌ఎంవో భారతి మాట్లాడుతూ గతంలో వైద్యాలయాన్ని నాలుగు పర్యాయాలు కాయకల్ప బృందం సందర్శించినట్లు పేర్కొన్నారు. రెండుసార్లు రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వైద్యాలయం నిలిచిందన్నారు. ప్రభుత్వం నగదు ప్రోత్సాహాన్ని కూడా అందించినట్టు తెలిపారు. ఆ నిధులను ఆస్పత్రి అభివృద్ధికి ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. ఈసారి కూడా వైద్య సేవల్లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఆస్పత్రి నిలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌ఎంవో భారతితో మాట్లాడుతున్న కాయకల్ప బృందం వైద్యులు

ఇద్దరు అభాగ్యులకు సీఎం తక్షణ సాయం

సాక్షి, అనకాపల్లి: సమస్యలు చెప్పుకున్న వెంటనే స్పందించే సీఎం చల్లని హృదయం మరో ఇద్దరికి అండగా నిలిచింది. యలమంచిలి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ దగ్గర ఇద్దరు బాధితులు, వారి కుటుంబ సభ్యులు తమ బాధలు చెప్పుకొని ఆదుకోవాలని వేడుకున్నారు. వీరిలో ఒకరు యలమంచిలికి చెందిన కొండమంచి వాణి. ఆమెకు పుట్టిన దగ్గర నుంచి మాటలు రాలేదు.. చెవులు వినిపించవు. మరొకరు ఎస్.రాయవరం మండలం సైతాలుపేట గ్రామానికి చెందిన కలగా శివాజీ. మూడు సంవత్సరాల కిందట మోటార్ బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలబారిన పడ్డ అతని అవయవాలు ఏవీ పనిచేయడం లేదు. వారి పరిస్థితిని చూసి చలించిన ముఖ్యమంత్రి వారికి సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష చొప్పున చెల్లించమని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని ఆదేశించారు. వారికి సరైన వైద్య చికిత్సను అందించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి వారిద్దరికీ కలెక్టర్ ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఆ చెక్కులను అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు.



కలగా శివాజీకి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



కొండమంచిలి వాణికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఆర్డీవో

నేటి నుంచి గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్

- హాజరుకానున్న దేశ విదేశీ వైద్య నిపుణులు
- వర్చువల్‌గా ప్రసంగించనున్న సీఎం జగన్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సంపూర్ణ ఆరోగ్యం అనే థీమ్‌తో విశాఖలో తొలిసారిగా నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నోవాటెల్ వేదికగా ఈ సమ్మిట్ జరగనుంది. అమెరికాలో స్థిరపడ్డ 100 ఇండియన్ వైద్యులతోపాటు ప్రపంచ నలుమూలల నుంచి 450 మంది వైద్యులు హాజరవుతారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో రోగులకు మరింత మెరుగైన సేవలందించేందుకు వైద్య విజ్ఞానాన్ని పరస్పరం పంచుకుంటారు. మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, అవగాహన, శిశు, మాతాశిశు మరణాలు, పోషకాహారం వంటి అంశాలపై ఈ సమ్మిట్‌లో చర్చించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొని.. ప్రసంగిస్తారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ప్రతిష్టాత్మకమైన అవార్డును డాక్టర్ రవిరాజ్‌కు ప్రదానం చేయనున్నారు.

ఉప్పు 'కళ్లు' తెరిపిస్తోంది!

మనం తీసుకునే ఆహారానికి ఉప్పును జతచేస్తే రుచి వస్తుందని తెలుసుకున్నప్పటి నుంచి వేల ఏళ్లుగా మనిషి సముద్రపు ఉప్పునే వాడుతున్నాడు. అప్పట్లో పెద్దగా బీపీల్లేవ్. ఎముకల నొప్పులు, థైరాయిడ్ సమస్యల్లేవ్. ఊళ్లోని దుకాణాల ముందు బస్తాల్లో కల్లుప్పు/ఉప్పు కల్లు అలానే ఉంచేవారు. ఎందుకంటే ఉప్పును ఎవరూ దొంగిలించరు. ఆ రోజులు పోయాయి. ఈశాన్య రాష్ట్రాల్లో అయోడిన్ లోపం ఉందన్న కారణంతో దేశమంతా అయోడైజ్డ్ ఉప్పు రంగప్రవేశం చేసింది. అప్పటి నుంచే మన ప్రజల్లో ఆరోగ్య సమస్యలు పెరగాయని కొందరి వాదన. ఇపుడు మళ్లీ పూర్వ వైభవం దిశగా ఉప్పు కల్లు తయారీ, వినియోగం క్రమేపీ పెరుగుతోంది

- కల్లు ఉప్పు తయారీ కేంద్రాల్లో ఆనందం
- పెరుగుతున్న కల్లు ఉప్పు వినియోగం
- ఆరోగ్య స్పృహ పెరగడమే కారణం

ఎస్.రాయవరం: జిల్లాలో ఉప్పును పండించే రేవుపోలవరం మళ్లీ కళకళలాడుతోంది. గత కొంతకాలంగా కల్లు ఉప్పునకు ఆదరణ తగ్గడంతో ఉప్పు పండించే కార్మికులకు ఉపాధి తగ్గుముఖం పట్టింది. అయితే కల్లుప్పే ఆరోగ్యానికి మంచిదన్న స్పృహ పెరగడంతో ఇపుడిపుడే తమ వ్యాపారం పుంజుకుంటోందని ఉప్పు తయారీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రేవుపోలవరం తీరం పరిధిలో ఉప్పు గల్లీలు

దశాబ్దాల ఉపాధి

దశాబ్దాల కాలంగా ఎస్.రాయవరం మండలంలో వందల ఎకరాల్లో ఉప్పును పండిస్తున్నారు. రేవుపోలవరం సమీపంలో పెదఉప్పలం, చినఉప్పలం పరిధిలో రెండు యూనిట్లుగా 300 ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి చేస్తున్నారు. ఏటా నవంబర్ మొదలుకుని జూన్ వరకు ఉప్పును పండిస్తారు. పూర్తిగా సముద్రపు నీటిని ఉపయోగించి ఉప్పును తయారు చేస్తారు. గతంలో 400 మందికి పైగా కార్మికులు పని చేస్తూ, 75 వేల బస్తాలు(బస్తా 75 కిలోలు) పండించేవారు. ప్రస్తుతం అది 200 మంది కార్మికులు, 30 వేల బస్తాలకు పరిమితమయింది.

వేగంగా అమ్ముడవుతోంది

కొన్నాళ్ల క్రితం వరకు కనీస స్థాయిలో ఉత్పత్తి చేసినా.. వేగంగా అమ్ముడుపోయే పరిస్థితి ఉండేది కాదు. ఈ మధ్య కాలంలో కల్లు ఉప్పు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో డిమాండ్ కూడా పెరిగి, ఉత్పత్తి చేసిన సరకు వేగంగా అమ్ముడుపోతోందని పరిశ్రమల యాజమాన్యాలు చెబుతున్నాయి. తాజాగా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఉన్న హెటిరో డ్రగ్స్ కూడా కల్లు ఉప్పును కొనుగోలు చేస్తోంది. అన్నదాతలు కొబ్బరి తోటలకు ఎరువుగా, చీడపీడల నివారిణిగా ఉప్పును వినియోగిస్తున్నారు. దీంతో రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం, చినఉప్పలం, పెదఉప్పలం, పిట్లపాలెం, వాకపాడు తదితర గ్రామాలకి చెందిన సుమారు 200 మందికి ఉపాధి లభిస్తోంది. వీరితో పాటు చెన్నై, భీమిలి ప్రాంతానికి చెందిన వారు టెక్నికల్ వర్కర్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు.



పండిన ఉప్పును ఎగుమతికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

ఉప ఉత్పత్తులతో లాభం

ఉప్పునుంచి వచ్చే ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు నెలకొల్పితే మరింత మందికి ఉపాధి కలుగుతుంది. టేబుల్ సాల్ట్, శుద్ధమైన క్రిస్టల్ ఉప్పు, బేకింగ్ సోడా తదితర ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేయొచ్చు. ఈ తరహా పరిశ్రమలు ఎక్కువగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో ఉన్నాయి. మన రాష్ట్రంలోని అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో మాత్రమే ఉప్పు తయారీ కేంద్రాలు ఉన్నాయి. కాకినాడ సమీపంలో రిలయన్స్ సంస్థ సాల్ట్, బేకింగ్ సోడా తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. అది మినహా మరెక్కడా ఇలాంటి పరిశ్రమలు లేవు. ఉప్పు ఉప ఉత్పత్తుల తయారీపై యాజమాన్యాలు అధ్యయనం చేసి, ఇక్కడ కూడా నెలకొల్పితే లాభసాటిగా ఉండవచ్చు.

పంట పరిధి పెరగాలి

ఉప్పు పండించే ఏరియాను పెంచితే పరిశ్రమల ఏర్పాటుకు వెసులుబాటు ఉంటుంది. పరిశ్రమలు వస్తే ఒక్కోదాంట్లో 300–500 మందికి ఉపాధి దొరుకుతుంది. ఉప్పు గల్లీల నిర్వహణకు కేంద్రం భూముల్ని 20 ఏళ్లకు లీజుకిస్తుంది. లీజు కూడా ఎకరాకు రూ.3 వేలు మాత్రమే. ఎకరాలో 20 మెట్రిక్ టన్నుల వరకు ఉప్పు పండించొచ్చు. తయారీ, విక్రయాలు, ఎగుమతులు అంతా కాంట్రాక్టర్లే చూసుకుంటారు.

– నజీర్ ఇస్లాం, సాల్ట్ ఇన్‌స్పెక్టర్, భీమిలి

పరిశ్రమలు రావాలి

మా గ్రామానికి అనుకుని ఉప్పు తయారీ వందల ఎకరాల్లో ఉన్నాయి. రోజు కూలీలకు ఇదే జీవనాధారం. అది కూడా ఏడాదంతా ఉండదు. ఉప్పు ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఏడాదంతా వందల మందికి ఉపాధి దొరుకుతుంది. కేంద్ర ప్రభుత్వ స్థలాలున్నాయి. వీటిని పరిశ్రమల ఏర్పాటుకు వాడుకోవచ్చు.

– చోడిపల్లి అప్పన్న, వైస్ ఎంపీపీ, కొత్తరేవుపోలవరం

ఉప్పు పరిశ్రమకు కేటాయించిన వందలాది ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయి. తక్కువ వ్యయంతోనే అనుబంధ పరిశ్రమలు నెలకొల్పితే అనేకమందికి ఉపాధి కల్పించవచ్చని అధికారులు చెప్తున్నారు.

క్లుప్తంగా

త్వరలో మరో రెండు సినిమాలు

ధమాకా సినిమా డైరెక్టర్ త్రినాథరావు



నర్సీపట్నం: త్వరలో రెండు పెద్ద సినిమాలకు దర్శకత్వం వహిస్తున్నానని ధమాకా సినిమా డైరెక్టర్ నక్కిన త్రినాథరావు చెప్పారు. ఆయన గురువారం నర్సీపట్నంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ధమాకా సినిమాకు ప్రజల నుంచి మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా త్వరలో రెండు సినిమాలు తీసేందుకు ప్రణాళిక సిద్ధం చేశానన్నారు. నిర్మాత దిల్‌రాజు, మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై పెద్ద సినిమాలు తీసేందుకు ప్రక్రియ మొదలు పెట్టానన్నారు.

రైల్వే ట్రాక్‌పైకి బహిర్భూమికి వెళ్లి...



నాగరాజు మృతదేహం



నాగరాజు(ఫైల్)

అనకాపల్లిటౌన్: గుర్తు తెలియని రైలు ఢీకొని చుక్కా నాగరాజు(76) అక్కడికక్కడే మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం వివరాల ప్రకారం.. పట్టణంలో గాంధీనగరానికి చెందిన నాగరాజు బహిర్భూమికని బుధవారం రాత్రి విజయరామరాజుపేట రైల్వేట్రాక్‌పైకి వెళ్లాడు. నాగరాజు అదమరుపుగా ఉండడంతో గుర్తు తెలియని రైలు ఢీకొన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. స్టేషన్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

మీ ఫ్యామిలీ డాక్టర్

- నేరుగా రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు
- ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు సర్వత్రా ప్రశంసలు
- జిల్లాలో రోజుకు 600 మందికి పరీక్షలు
- అచేతన రోగులకు వరం
- ఉచితంగా మందుల పంపిణీ

మాడుగుల: సాధారణంగా ఫ్యామిలీ డాక్టర్ అంటేనే ఏదైనా ఉన్నత స్థాయి కుటుంబానికి ప్రత్యేకంగా వైద్య సేవలందిస్తారు. అది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి పేద, మధ్య తరగతి ప్రజలు దానికి జోలికి వెళ్లరు. ఇదంతా ఒకప్పటి మాట.. ఇప్పుడు వీరి ఇంటి వద్దకే వైద్యాధికారులు వెళ్లి ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ఇది సాధ్యమవుతోంది. దాంతో మెరుగైన వైద్యం అందుకుంటున్న మంచాన పడిన దీర్ఘకాలిక రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సేవలు ఇలా..

గతేడాది అక్టోబరు 21న ప్రారంభమైన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పథకం ద్వారా అనకాపల్లి జిల్లాలో నెలకు 18 వేల మంది నిరుపేద దీర్ఘకాలిక రోగులను పరీక్షిస్తున్నారు.

- 104 వాహనంలో ఒక వైద్యాధికారి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తోపాటు డ్రైవర్ ఉంటారు.
- వీరు విలేజ్ క్లినిక్ కేంద్రానికి ఉదయం 9.30 గంటలకు వస్తారు. సాయంత్రం 4 గంటల వరకు సేవలందిస్తారు. అక్కడ స్థానిక సచివాలయ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ముందుగానే రోగులను నమోదు చేసి ఓపీకి పంపిస్తారు.
- ఓపీ అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను పరీక్షిస్తారు.
- ఈ పథకం ద్వారా గ్రామంలోనే బీపీ, సుగర్, ఈసీజీ, తదితర 11 రకాలు పరీక్షలు చేస్తున్నారు.
- 13 రకాల వైద్య సేవలందిస్తున్నారు.
- 67 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.



కేజేపురంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

- 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంచుతున్నారు.
- నెలలో ఒక గ్రామాన్ని రెండుమార్లు సందర్శించి వైద్య పరీక్షలు చేస్తుంటారు.

కిశోర బాలికలకు సలహాలు..

జిల్లాలో 45 పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్యులు, తమ సిబ్బందితో గ్రామంలో ఇంటింటికీ తిరిగి కిశోర బాలికలకు పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉంటే, ఐరన్ మాత్రలు అందజేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

తాగునీటి వనరుల తనిఖీలు

80 శాతం రోగాలు సురక్షిత నీరు తాగకపోవడం వల్లే వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రక్షిత నీటి పథకం శుభ్రంగా ఉందా లేదా, క్లోరినేషన్ అయిందా లేదా అని వారి వద్ద మెషీన్‌తో తనిఖీలు చేస్తారు. నీటిలో అవశేషాలు ఉంటే పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తున్నారు.

2 నుంచి 4 వేల జనాభాకు ఒక విలేజ్ క్లినిక్

గ్రామ సచివాలయ పరిధిలోని 2 వేల జనాభా నుంచి 4 వేల జనాభాకు ఒక విలేజ్ క్లినిక్ కేంద్రం ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని వైద్య సేవలందిస్తున్నారు. జిల్లాలో 424 విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

బీపీ, సుగర్ రోగులకు వరం

గ్రామీణ ప్రాంతంలో బి.పి, సుగర్ రోగులు ప్రతినెలా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేయించుకుని మందులు తీసుకోవడానికి కనీసం రూ.వెయ్యి ఖర్చయ్యేది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పథకం ద్వారా గ్రామంలోనే వైద్యాధికారి సమక్షంలో పరీక్షలు చేస్తున్నారు. మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పేద రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వీరనారాయణంలో జ్వరపీడితురాలి ఇంటికెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యాధికారి ప్రసాద్‌పాత్రుడు

ఇంటి వద్దకే వచ్చి వైద్యం



ఎప్పుడైనా జ్వరం వస్తే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే రూ. వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఖర్చయ్యేది. ఇప్పుడు మా గ్రామానికి వైద్యాధికారి వస్తున్నారు. పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేసి సూచనలు, సలహాలు అందిస్తున్నారు. మా కష్టాలు గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

–కిల్లాడి రాము, సత్యవరం, మాడుగుల మండలం

స్పందన బాగుంది

ప్రస్తుతం జిల్లాలో 45 వాహనాల్లో 90 మంది వైద్యాధికారులు పని చేస్తున్నారు. అదనంగా మరో నలుగురు వైద్యాధికారులను నియమించారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోనే ఉంటూ ఓపీ చూసి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేస్తున్నారు. రోజుకు 600 మందికి పరీక్షలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామాల్లో స్పందన బాగుంది.

– వీరజ్యోతి, జిల్లా నోడల్ అధికారి, అనకాపల్లి

ఆంగ్లంలో అదరగొట్టారు...



తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టుల వివరాలు తెలుసుకుంటున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

- తాళ్లపాలెం గురుకుల విద్యార్థినులకు మంత్రి మేరుగు నాగార్జున కితాబు
- అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రాజెక్టుల పరిశీలన

కశింకోట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతిభ కలిగిన విద్యావంతులు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. దాని పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారన్నారు. విద్యార్థులకు చదువుకోవడానికి అమ్మ ఒడి కింద ఏటా రూ. 13500 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. అలాగే విద్యా దీవెన, విదేశాల్లో చదువుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి సీఎం విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేదలు కూడా చదువుకునే విధంగా ఉచితంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేర్చడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. బాగా చదువుకొని ఉత్తమ మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. వాటి పని తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు ఆంగ్లంలో ప్రాజెక్టుల గురించి వివరించడంతో ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను, హెచ్‌ఎం మళ్ల మాణిక్యం, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్, తరగతి గదులను, వంట శాలలను పరిశీలించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త రూపావతి ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల్లోను, ఇక్కడి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో తయారు చేసిన ప్రాజెక్టుల ద్వారా బహుమతులు, ఉన్నతాధికారుల ప్రశంసలతో సాధించిన విజయాలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, పలు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్

అచ్యుతాపురం(అనకాపల్లి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అచ్యుతాపురం మండలంలోని నునపర్తి శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 3,4,5వ తేదీల్లో చోడవరం ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన అంతర్‌జిల్లాల అండర్ –19 విభాగ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ జిల్లా బాల బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున ఆడి ప్రతిభ కనబరిచిన ఆర్.దుర్గాప్రసాద్, డి. కళ్యాణ్ రాజ్, ఆర్. కళ్యాణి, పీ. ప్రశాంతి, కె.రాజేశ్వరి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు సదరు క్రీడాకారుల్ని శాప్ డైరెక్టర్ జొన్నాడ రమణమ్మ, అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు, శ్రీనివాసరావు, పెదపూడి శంకర్‌రావు, మాసవరపు అప్పారావు అభినందించారు.

రాజ్యాంగంపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అంజయ్య

తుమ్మపాల: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ ప్రాథమిక అవగాహన అవసరమని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎన్.అంజయ్య తెలిపారు. పట్టణంలోని న్యూకాలనీలో కొడుగంటి గోవిందరావు అధ్యయన కేంద్రంలో భారత రాజ్యాంగం–భవిష్యత్తు అనే అంశంపై రాష్ట్ర స్థాయి అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. హిందూ సంస్థల కోరల్లో రాజ్యాంగం బందీ అయిపోతుందని, దీన్ని రక్షించేందుకు నేటితరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదిమ కాలం నుంచి రూపుమారిన, మారుతున్న పరిణామాలను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆచార్యులు కె.చిన్నయసూరి, కె.సూర్యనారాయణ మాట్లాడుతూ కులాల పుట్టుక, మతాల ఆవిర్భావం గురించి వివరించారు. ప్రాచీన భారత సమాజం, మధ్య యుగాల భారత సమాజం మార్పులను తెలుసుకోవాలన్నారు. ఆచార్య కె.శ్రీనివాసులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ, అధ్యయన కేంద్రం కన్వీనర్ రాజాన దొరబాబు, కో కన్వీనర్ కె.ఎస్. సన్యాసిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కమ్యూనిస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 12,84,518 మంది

ఓటర్ల సవరణ జాబితా వెల్లడి

తుమ్మపాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల సవరణ–2023 షెడ్యూల్ ప్రకారం జనవరి 5 నాటికి జిల్లాలో 12 లక్షల 84 వేల 518 మంది ఓటర్లు ఉన్నట్లు డీఆర్వో పి.వెంకటరమణ తెలిపారు. నవంబర్ 9 నుంచి 18,869 మంది కొత్త ఓటర్లుగా నమోదైనట్టు పేర్కొన్నారు. మరణించిన, డబుల్ ఎంట్రీ, వలస పోయిన 3,251 మందిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లను తొలగించామన్నారు. ఓటర్లలో 6,28,740 మంది పురుషులు, 6,55,716 మంది స్త్రీలు, 62 మంది థర్డ్ జెండర్ ఉన్నట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితాను ఆయా నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయం, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (తహసీల్దార్, జోనల్ కమిషనర్) కార్యాలయంలోను, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

నియోజకవర్గాల వారీ వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
చోడవరం	243	105037	110655	12	215704
మాడుగుల	235	93679	97618	06	191303
అనకాపల్లి	251	102893	108709	07	211609
ఎలమంచిలి	243	100438	104389	19	204846
పాయకరావుపేట	292	122418	124692	02	247112
నర్సీపట్నం	262	104275	109653	16	213944
మొత్తం	1526	628740	655716	62	1284518

అలరించిన వీణ, సన్నాయి కచేరీలు



కచేరీ చేస్తున్న వీణ వాయిద్య కళాకారులు

చోడవరం: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వీణా, సన్నాయి వాయిద్య కచేరీలు ఆహూతులను రంజింపచేశాయి. చోడవరం దేవదాయ శాఖ హార్టింజ్ రెస్ట్ హౌస్ ప్రాంగణంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీతంలో ప్రావీణ్యత కలిగిన బృందాలు పాల్గొని కచేరీలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ వీణా విద్వాంసులు ఎం. లోకేశ్వరి, బి. సత్యమణి, ఎం. హేమశ్రీ, రామకృష్ణ బృందం చేసిన వీణ కచేరీ అలరించింది. అదేవిధంగా ప్రముఖ నాదస్వర విద్వాంసులు వెంటురి రామదుర్గాప్రసాద్, కేసనకుర్తి దుర్గాప్రసాద్, సిహెచ్ సంతోష్, ఆర్. సన్నిబాబు, జి. ఆనందం బృందం సన్నాయి, డోలుతో నాదస్వర కచేరీ ఆద్యంతం ఆకట్టుకుంది. నిర్వాహకుడు రాయవరపు నానాజీ, గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణమూర్తి పాల్గొని ఈ బృందాల సభ్యులను సత్కరించారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత



కేజీహెచ్‌లో లబ్ధిదారి వరహాలమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం గ్రామానికి చెందిన గండేపల్లి వరహాలమ్మకు విశాఖ కేజీహెచ్‌లో వలంటీరు కుమార శ్రీను గురువారం పింఛను అందజేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె అక్కడ చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీరు శ్రీను మరో వలంటీరు ఆడారి జగ్గనాయుడుతో కలిసి తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. గతంలోనూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఐదుగురికి పింఛన్లు అందజేసి మానవత్వం చాటుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, వెల్ఫేర్ సహాయకుడు సాగర్, గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు.

కూర్మన్నపాలెంలో గజం రూ.71 వేలు

- వీఎంఆర్‌డీఏ ఈ వేలానికి విశేష స్పందన
- 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. 23 ప్లాట్ల విక్రయాలు
- వీటి ద్వారా సంస్థకు రూ.23.13 కోట్ల ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్లాట్ల ఈ–వేలం వీఎంఆర్‌డీఏకు కోట్లు కురిపించింది. కూర్మన్నపాలెంలో గజం ధర అత్యధికంగా రూ.71 వేలుకు వెళ్లింది. వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన వేలానికి విశేష స్పందన లభించింది. మొత్తం 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. అందులో 23 ప్లాట్ల విక్రయాల ద్వారా సంస్థకు రూ.23.13 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ–వేలం వివరాలను గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెం, పెదగంట్యాడ, మర్రిపాలెం, మాధవధార, మధురవాడ సైబర్ వ్యాలీ, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్లలో ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీ కింద 46 మిగులు ప్లాట్లకు ఈ నెల 3, 4 తేదీల్లో ఈ–వేలం ద్వారా విక్రయాలు చేపట్టారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసేందుకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. అధికారులు నిర్ణయించిన అప్‌సెట్ ధరకు రెట్టింపు మొత్తంలో ప్లాట్లను కొనుగోలు చేశారు.

కూర్మన్నపాలెం ప్లాట్లకు అత్యధిక ధర

ఈ వేలంలో 46 ప్లాట్లకు విక్రయాలు చేపట్టగా అందులో 23 ప్లాట్లు అమ్ముడయ్యాయి. 3వ తేదీన జరిగిన వేలంలో 14 ప్లాట్లు, 4వ తేదీన నిర్వహించిన వేలంలో 9 ప్లాట్లు అమ్మకాలు జరిగాయి. వీటిలోను కూర్మన్నపాలెం, మాధవధార, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న లేఅవుట్లలో ప్లాట్లను దక్కించుకోడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపించారు. ప్రధానంగా కూర్మన్నపాలెం ఫేజ్–6లో ఎంఐజీ–191 ప్లాట్‌లో గజంకు రూ.35 వేలు అప్‌సెట్ ధరగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.71 వేలుకు కొనుగోలు చేశారు. దీంతో 271.67 గజాలను రూ.1,92,88,570 పలికింది. అలాగే ఇదే ఫేజ్‌లో 192 ప్లాట్‌కు గజం రూ.70,700కు వెళ్లింది. అదే విధంగా మాధవధార లే అవుట్‌లో గజం రూ.68 వేలు, మధురవాడ సైబర్ వ్యాలీలో గజం రూ.60,900కు వెళ్లింది. అత్యల్పంగా డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్‌లో అప్‌సెట్ ధర గజం రూ.14 వేలు పెట్టగా.. కేవలం రూ.14900లకు కొనుగోలు చేశారు.

7న దాకమర్రి ఎల్‌ఐజీ ప్లాట్లకు లాటరీ

దాకమర్రిలో ఎల్‌ఐజీ ప్లాట్లను ఈ నెల 7వ తేదీన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు సంస్థ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ముందుగా రిజర్వ్ కేటగిరీలో వారికి లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఇందులో కేటాయింపులు రాని వారికి మళ్లీ జనరల్ కేటగిరీలో సదరు దరఖాస్తులను కలిపిన తరువాత లాటరీ తీస్తారని వివరించారు. లాటరీలో ప్లాట్ల కేటాయింపులు జరగని వారికి అదే రోజున ఎంఈడీని చెక్కు రూపంలో తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులందరూ ఈ లాటరీ ప్రక్రియకు హాజరవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

3,601 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



రైతులు, మిల్లర్లతో మాట్లాడుతున్న పౌరసరఫరాల డీఎం రాజేశ్వరి

నాతవరం: జిల్లాలో ప్రస్తుతం 3,601 మెట్రిక్ టన్నుల ధాన్యం కొలుగోలు చేసినట్టు పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి డీఎం పి.రాజేశ్వరి తెలిపారు. నాతవరంలో గురువారం డీఎస్‌వో కేవీఎస్ఎన్ ప్రసాద్‌తో కలిసి, రైస్ మిల్లర్లు, రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 78 క్లస్టర్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నాతవరం మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిల్లర్లు, రైతులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యత ఉన్న ధాన్యాన్ని ఆర్‌బికే కేంద్రాల్లో యథావిధిగా కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు, మిల్లర్లకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేందుకు చర్చించినట్టు తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలుకు నాలుగు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రైతుల అభీష్టం మేరకు తడిసిన ధాన్యాన్ని కూడా వారు కొనుగోలు చేస్తారన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఆర్‌బికే కేంద్రాలు, రైస్ మిల్లర్లు ఎక్కడైనా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డీసీవో వీవీఎల్ఎన్ కిరణకుమారి, తహసీల్దార్ కనకారావు, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి చిరంజీవి, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పేదింటికి పింఛన్ పండగ

- పింఛన్ పెంపుతో ఆనందంలో లబ్ధిదారులు
- కొత్త పింఛన్లతో ముందే వచ్చిన పండగ



మహిళకు పింఛన్ అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి(ఫైల్)

అనకాపల్లిటౌన్ : అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు, వైద్య సమస్యలున్నవారు తమకు భారమని ఏ ఒక్క కుటుంబ సభ్యుడూ అనుకోరాదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకే ప్రభుత్వం నుంచి నెలనెలా వారికి ఆత్మస్థైర్యంతో కూడిన భరోసా కల్పించాలనుకున్నారు. అందులో భాగంగానే గత ప్రభుత్వం ఎన్నికలకు కొన్ని నెలల ముందు పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏటా పెంచుతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తానిచ్చిన హామీని నెరవేరుస్తూ.. పింఛన్ లబ్ధిదారుల్లో పింఛన్ మొత్తంతోపాటు.. ఆనందాన్ని పెంచుతున్నారు.

కరోనా కల్లోలంలో కూడా..

ప్రపంచమంతా విపత్తు భయంతో సంక్షేమంపై వెనుకడుగు వేసినా.. సీఎం జగన్ మాత్రం తానిచ్చిన మాటకు కట్టుబడే నిలిచారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొంటూనే, రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు రోడ్డున పడకుండా జీవించాలనే పింఛన్ మొత్తాన్ని పెంచారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా పెంచి ఈ ఏడాది జనవరి నుంచి ఒక్కో పింఛన్ లబ్ధిదారునికి రూ.2,750లు అందజేస్తున్నారు. గత ప్రభుత్వాల్లో పింఛన్ పొందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జగన్ ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులేమీ లేవని, ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు తమ ఇంటికొచ్చి మరీ పింఛన్ మొత్తాన్ని అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ఏడాదిలో పెరిగిన పింఛన్

కొత్త సంవత్సరం రాకతోనే పింఛన్ లబ్ధిదారుల్లో ఆనందం పెరిగింది. జనవరి నుంచి పట్టణంలో కొత్తగా 287 మందికి, మండలంలో 349 మందికి పింఛన్లు మంజూరు చేశారు. జీవీఎంసీ జోన్ పరిధిలో పాత పింఛన్లు 9,913 ఉండగా కొత్తగా 287 మందికి మంజూరు చేయడంతో రూ.2 కోట్ల 83 లక్షల 86వేల 500 నగదు రూపంలో లబ్ధిదారులకు చెల్లించారు. మండల పరిధిలో పాత పింఛన్లు 12,327 ఉండగా కొత్తగా 349 మందికి మంజూరయ్యాయి. దీంతో ఈ నెల రూ.3 కోట్ల 50లక్షల 80వేల 500లు అవ్వతాత, వితంతు, దివ్యాంగ, చేనేత కార్మికులు తదితర కేటగిరీలకు అందించారు. పట్టణ, మండల పరిధిలో 56 సచివాలయాల వలంటీర్ల తంచనుగా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారు.

పింఛన్ల వివరాలు

కేటగిరీ	పట్టణం	మండలం
వృద్ధులు	5,017	6,818
వితంతువులు	3,458	3,126
దివ్యాంగులు	1,257	1,315
మెడికల్	52	1,309

జగనే మళ్లీ సీఎం



ప్రభుత్వ పింఛన్ తీసుకోవడం ఇదే ప్రథమం... అప్పలనరసమ్మ, సిరసపల్లి, అనకాపల్లి మండలం..

నాకు ఆగష్టు నెలకు 60 సంవత్సరాలు వచ్చాయి. వలంటీర్‌కు పూర్తి వివరాలు అందించాం. డిసెంబర్‌లో పింఛన్ కోసం వలంటీర్ కంప్యూటర్లో పెట్టినట్టు చెప్పారు. కొత్త పింఛన్ రూ.2,750 అందుకున్నా. మళ్లీ మళ్లీ జగనే సీఎం కావడం ఖాయం. – అప్పలనరసమ్మ, సిరసపల్లి

జగన్‌బాబే మాకు ఆసరా



వృద్ధాప్యంలో పని చేసేందుకు శరీరం సహకరించదు. ఓపిక తెచ్చుకుని వెళ్దామన్నా.. పని దొరికేదీ కష్టమే. దీంతో ఇంటా బయటా ఇబ్బందులే. వయసు సహకరించినన్నాళ్లు కష్టించి పని చేసి నా ఇద్దరి పిల్లలకు వివాహం చేశా. ఈ వయసులో ప్రభుత్వం నుంచి పింఛన్ రూపంలో మాకు ఆసరా దక్కడం.. అంతా ముఖ్యమంత్రి జగన్‌బాబు చలవే.

– గణేష్, గవరపాలెం

బతుకుపై భరోసా



నా భర్త అనారోగ్యంతో అయిదు నెలల క్రితం మృతి చెందాడు. ఇద్దరు చిన్నపిల్లలతో బతుకు దుర్భరంగా ఉంది. వారి ఆలనా పాలనా చూసుకుంటూ రోజువారీ కూలి పనులకెళ్తున్నా. పింఛన్ కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు పెట్టుకున్నాక.. వెంటనే మంజూరయింది. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఈ పింఛన్ ప్రస్తుత నా బతుక్కి ఎంతో భరోసానిచ్చింది.

– సుజాత, కోట్నివీధి

ఇబ్బందులుంటే పరిష్కరిస్తాం



అర్హత కలిగిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్స పొందుతున్న ప్రతీ ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో ఏడాదికి రెండు సార్లు నమోదు చేస్తున్నాం. అర్హుల్లో ఏ ఒక్కరికీ పింఛన్ రావట్లేదన్న పరిస్థితి లేదు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరిస్తున్నాం.

– డి.చంద్రశేఖర్, ఎంపీడీవో, అనకాపల్లి

క్లుప్తంగా

నేటి నుంచి కశింకోటలో 'గడప గడపకు'

కశింకోట : మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నుంచి వరుసగా ఆరు రోజులపాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు గురువారం తెలిపారు. తొలి రోజైన 6న మధ్యాహ్నం 3 గంటలకు, మరుసటి రోజు 7న ఉదయం 9 గంటలకు జమాదులపాలెం గ్రామంలోను, 8న ఏనుగుతునిలో, 9, 10, 11 తేదీల్లో కశింకోటలోను ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుతోపాటు, ప్రజా సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు, అభిమానులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.5 తగ్గింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం రూ.15కు తగ్గింది. బంగాళాదుంపలు రూ.20, ఉల్లి రూ.25, క్యాబేజీ, చిలగడ దుంప, కర్ర పెండలం రూ.30, క్యారెట్, బరబాటి, వంగ రూ.40, బీర రూ.50, చిక్కుడు, బీన్స్, దొండ, బఠాణీకాయలు, బెండ రూ.60, క్యాప్సికం రూ.80, గోబీ పువ్వు పెద్దది రూ.20, గుమ్మడి పండు రూ.50 ధర వద్ద విక్రయాలు సాగాయి.

రోడ్డు పునరుద్ధరణ



కాపుశెట్టివానిపాలెం ప్రధాన రహదారిలో తారు రోడ్డు నిర్మాణం

తుమ్మపాల : అనకాపల్లి–సబ్బవరం జాతీయ రహదారికి ఆనుకుని కాపుశెట్టివానిపాలెం జంక్షన్ ప్రధాన రహదారికి మరమ్మతులు పూర్తిచేశామని సర్పంచ్ మార్పూరు సన్యాసమ్మ తెలిపారు. అనకాపల్లి మండలం రేబాక పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి అనుసంధానంగా గ్రామంలోకి వెళ్లే రోడ్లు జాతీయ రహదారి విస్తరణతో మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ అంశాన్ని జాతీయ రహదారి కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి తారు రోడ్డు ఏర్పాటుకు కృషి చేశారని పేర్కొన్నారు. వారం రోజుల్లో రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్టు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 8,137 బెల్లం దిమ్మలు వచ్చాం

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,450	4,020
మొదటి రకం	3,300	3,570
రెండో రకం	3,070	3,310
మూడో రకం	2,910	3,060

అనకాపల్లి సినిమాలు

ధమాకా	-రాజా
ప్రత్యర్థి	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్(తెలుగు)	-వెంకటేశ్వర
లవ్ టుడే	-శ్రీసత్య
అవతార్-2	-రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 63 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు, ఏ నెగిటివ్–2 యూనిట్లు, బీ పాజిటివ్–8 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్ 35 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సమష్టి పోరాటంతో సమస్యల పరిష్కారం

అనకాపల్లిటౌన్ : వృద్ధులంతా సమష్టిగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. స్థానిక పి.వి.రమణ రైతుభారతి హాల్లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులకు అన్ని రాయితీలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 60 సంవత్సరాలు నిండిన 30 మంది వృద్ధులకు సంఘ గుర్తింపు కార్డులు అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎస్ఎస్ అప్పారావు, బుద్ద తాతారావు, చదరం కోటేశ్వరరావు, అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న కమిటీ ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి డాక్టర్ ఎం.వెంకట రమణ, కమిటీ సభ్యులు బండారు మంగ, యడ్ల నాయుడు తదితరులు సమావేశమై ఆస్పత్రి అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రెండు కొత్త కంప్యూటర్లను ప్రారంభించారు. అనంతరం లేబరేటరీకి సంబంధించిన ఆధునిక పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోకం రామునాయుడు, బండారు శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసరావు, ఫార్మాసిస్టు శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ అనిత, ల్యాబ్ టెక్నీషియన్ జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

బైజూస్ ట్యాబ్‌ల వినియోగం తప్పనిసరి

- హెచ్‌ఎంలకు ఎస్ఎస్ఏ కో ఆర్డినేటర్ సూచన



డిజిటల్ తరగతుల పని తీరును పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి

కశింకోట : ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న డిజిటల్, వర్చువల్ తరగతి గదులను వినియోగంలో ఉంచేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సర్వ శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఎంఐఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వి.శ్రీలక్ష్మి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేగాడ గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఆయా పాఠశాలల్లో డిజిటల్, వర్చువల్ తరగతి గదుల్ని పరిశీలించారు. వాటి పనితీరుపై ఆరా తీశారు. అలాగే జగనన్న విద్యా కానుకలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్‌లు ఎలా పని చేస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. వీటిపై సంబంధిత హెచ్‌ఎంలతో చర్చించారు. ట్యాబ్‌లను ప్రతి విద్యార్థి ఉపయోగించేలా చూడాలని కోరారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మార్తా తిలకం, కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ చంద్రకళ, కొత్తపల్లి హైస్కూలు హెచ్ఎం పద్మాకర్, తేగాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం క్రిష్టోఫర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తులసీరావు మృతి తీరని లోటు



యలమంచిలిలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్

కశింకోట : విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పట్ల పలువురు గురువారం సంతాపం తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పాల సంఘం సెక్రటరీ జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ అభివృద్ధికి విశేషంగా కృషి చేయడంతోపాటు పాడి రైతులకు ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. గ్రామాల్లో కల్యాణ మండపాలు, సాగునీటి అభివృద్ధి పనులు తదితర సేవా కార్యక్రమాలతో రాష్ట్రంలో డెయిరీకి గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. తులసీరావు మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కళాశాలఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు

సబ్బవరం : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తెలిపారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీ గ్రంథాలయాధికారి రమణ మాట్లాడుతూ ఇప్పటికే కొత్త పుస్తకాలు 888 అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ పుస్తకాలను ప్రతి మండలంలోని మండల శాఖా గ్రంథాలయాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారిణి జి.సత్యవతి, ఎన్ఎస్ఎస్ అధికారి పీపీసీహెచ్ వరప్రసాద్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



నాయుడుపాలెంలో పల్లకీ సేవలో భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో దేవాలయ కేంద్రంగా గురువారం మేలుకొలుపు కార్యక్రమం భక్తులు నిర్వహించారు. కార్యక్రమంతో గ్రామాల్లో యువకులు, మాతృమూర్తులు, పెద్దల్లో భక్తి భావం పెరిగి పూర్వ వైభవం కనిపిస్తుందని సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం ప్రతీ దేవాలయం కేంద్రంగా గ్రామస్తులంతా సామూహిక హారతి నిర్వహించాలని సూచించారు. ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని ప్రతి గ్రామంలో జరపాలన్నారు. ఈ నెల 18 నుంచి 26 వరకు పంచాయతీ కేంద్రంగా భారత మాత పూజలను గ్రామ ధార్మిక జట్టుతో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

రైతులకు పొద్దు తిరుగుడు, నువ్వు విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్

మునగపాక : ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరబుపాలెంలో గురువారం ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పొద్దు తిరుగుడు, నువ్వు విత్తనాలను రాయితీపై అందజేశారు. పాలసంఘం అధ్యక్షుడు గంగాధర్, ఉప సర్పంచ్ దొడ్డి కృష్ణ, ఫౌండేషన్ ఏరియా అధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

స్కూల్‌కు క్యారంబోర్డు వితరణ



క్యారంబోర్డును విద్యార్థులకు అందిస్తున్న దృశ్యం

కశింకోట : క్రీడలను ప్రోత్సహించడానికి క్యారంబోర్డును వితరణ చేయడం అభినందనీయమని కశింకోట డీఏఎస్ జెడ్పీ హైస్కూలు హెచ్ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇదే స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు వి.ఎం.సుధారాణి గురువారం క్యారం బోర్డును అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ క్రీడా పరికరాలు సమకూర్చడం వల్ల విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీ వేదుల ప్రభాకరరావు, ఉపాధ్యాయులు శేషుకుమారి, వరలక్ష్మి, ఆచంట రవి, పి.వి.ఆర్.ప్రభాకర్, ఆనంద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం మార్పు



పాత స్తంభంపై విద్యుత్ వైర్లు తొలగిస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్ : వేల్పులవీధి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. దీంతో ఆయన నూతన స్తంభాన్ని రహదారికి అవతల ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ఆ స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభాన్ని రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో గురువారం ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐరన్ వస్తువుల వేలం 10న

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఐరన్ వస్తువులకు ఈ నెల 10న వేలంపాట నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. పాటలో పాల్గొనేవారు ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పాటదారులు ధరావతు రూ.500 చెల్లించాలన్నారు.

ఈ- పంట నమోదు చేసుకోవాలి



చెరకు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహనరావు

మునగపాక : రబీకి సంబంధించి రైతులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహనరావు కోరారు. గురువారం ఆయన తిమ్మరాజుపేటలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈనెల 15వ తేదీ లోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ సేవలు పొందేందుకు ఈకేవైసీ తప్పనిసరన్నారు. అలాగే వ్యవసాయ కార్యాలయంలో పొద్దు తిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ శ్వేతా మీనన్ పాల్గొన్నారు.

ఘనంగా మాధవాచార్యుల జయంతి



మాధవాచార్యుల జయంతిలో విద్యార్థులు

అనకాపల్లి రూరల్: బ్రాహ్మణ సంక్షేమ సంఘం, అర్చక పురోహిత సంఘం జిల్లా నాయకుడు దివంగత గోపినంబాల మాధవాచార్యుల జయంతి వేడుకలు స్థానిక సత్యనారాయణపురంలో గురువారం జరిగాయి. పెద్దలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణపురం కనకదుర్గ ఆలయ ప్రథమ ప్రధానార్చకునిగా , అనకాపల్లి కన్యకాపరమేశ్వరి, అయ్యప్పస్వామి దేవాలయాల ప్రధానార్చకునిగా, పలు ఆలయాల నిర్మాణ నిర్వాహకుడిగా ఆధ్యాత్మిక రంగంలో మాధవాచార్యులు ఎన్నో సేవలందించారని వారు కొనియాడారు. సత్యనారాయణపురంలో పాఠశాల ఏర్పాటు, పలు అభివద్ధి పనుల్లో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పెనుమత్స కృష్ణంరాజు, చదరం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సురేఖ, రత్నం, వెంకటలక్ష్మి, మణి, గోపినంబాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు చెల్లింపులు



జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : కశింకోట పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలకు సరిపడా చెల్లింపులు చేయనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. గురువారం స్థానిక వడ్డి వీధి, కస్పా వీధి, సత్తెమ్మ కాలనీల్లో నిర్మిస్తున్న జగనన్న లే అవుట్లను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం పని దినాల చెల్లింపుల కోసం లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యుల జాబ్ కార్డులతో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. చెల్లింపులు త్వరితగతిన చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఒంపోలులో ఉచిత పశు వైద్యశిబిరం



ఒంపోలులో పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

మునగపాక : మండలంలోని ఒంపోలు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పశుపోషణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. లంపీస్కిన్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీకృత దాణాను వినియోగించడం వల్ల పాల దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి భానుబాబు, రిలయన్స్ ప్రతినిధి రాము, గోపాలమిత్ర ఆర్‌డీఎస్ అప్పారావు, రైతులు బొద్దపు శ్రీరామమూర్తి, నరాలశెట్టి తాతారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం



మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభ దోహదపడుతుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల నిర్వహణపై పాలకవర్గం పాటుపడుతుందన్నారు. అవసరమైన చోట రహదారులు, మురుగుకాల్వల అభివృద్ధి, శ్మశానవాటిక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.